క్లుప్తంగా

నేడు ఆది శంకరాచార్యుల జయంతి

కడప కల్చరల్ : జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యుల జయంతిని మంగళవారం నిర్వహించనున్నట్లు కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోగల బిట్రా పట్టాభిరామయ్య భగవద్గీత సత్సంగం అధ్యక్షుడు కాకనూరు సుబ్బారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఆలయం వద్ద నుంచి ఉదయం 5.30 గంటలకు పురవీధుల్లో నగర సంకీర్తన నిర్వహిస్తున్నామని తెలిపారు. సాయంత్రం 7.00 గంటలకు ధర్మాచార్యులు పసుపులేటి శంకర్ శంకర జయంతి విశిష్టతపై ప్రవచనం చేబుతారని, ఈ ధర్మ ప్రచార కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు.

ఆప్కోలో వస్త్రాలపై ప్రత్యేక డిస్కౌంట్

కడప కోటిరెడ్డిసర్కిల్ : వివాహాలు, వేసవిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆప్కో కడప డివిజన్‌లో వస్త్రాలపై ప్రత్యేక డిస్కౌంట్ ఇస్తున్నట్లు ఆప్కో మండల వాణిజ్య అధికారి వరప్రసాద్ తెలిపారు. కడప నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయం సమీపంలోని తమ షోరూంలోని క్లియరెన్స్ సేల్స్ కౌంటర్‌లో ఈనెల 20 నుంచి ఈ అమ్మకాలు కొనసాగుతున్నాయన్నారు. అలాగే 1+1, 1+2 విక్రయాల కూడా జరుగుతున్నాయని వివరించారు. మాధవరం, రాజమండ్రి, బందరు, వెంకటగిరి, చీరాల, ఉప్పాడ చీరలు, పొందూర్ షర్టింగ్, పట్టు, కాటన్ దోవతులు, టవళ్లు కొనుగోలు చేసి చేనేతలను ప్రోత్సహించాలని ఆయన కోరారు.

ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపు ప్రారంభం

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–2 ఆధ్వర్యంలో సోమవారం స్పెషల్ క్యాంపు ప్రారంభమైంది. ఈ క్యాంపును కళాశాల ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజ సేవ చేసేందుకు ఎన్‌ఎస్‌ఎస్ ఒక చక్కటి మార్గమన్నారు. వారం రోజుల పాటు నిర్వహించే స్పెషల్ క్యాంపులో ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని కోరారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంకాల నాగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

గొడుగులు పంపిణీ

కడప స్పోర్ట్స్ : ఎండతీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అభయ ఫౌండేషన్, మదర్ థెరిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. సోమవారం నగరంలోని వైవీ స్ట్రీట్, గర్ల్స్ కళాశాల, పాతబస్టాండు, సీఎస్ఐ స్కూల్, జెడ్పీ సమీపంలోని చిరువ్యాపారులకు గొడుగులు అందజేశారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి మణికంఠ ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు రమణ, నాగమల్లారెడ్డి, ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

వైవీయూ : కడప నగరంలోని రిమ్స్‌లో సోమవారం బ్లడ్ టు లివ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు పట్టుపోగుల పవన్‌కుమార్ 26వసారి రక్తదానం చేశారు. సంస్థ ఆధ్వర్యంలో రక్త కొరతను నివారించేందుకు రక్తదానవారోత్సవాల్లో భాగంగా సోమవారం రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ రక్తకొరత కారణంగా ఏ ఒక్కరి ప్రాణం పోకూడదన్న ఉద్దేశ్యంతో రక్తదాన చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రిమ్స్ బ్లడ్ బ్యాంకు వైద్యులు రాఘవేంద్ర పాల్గొన్నారు.

మే 6 నుంచి డీవైఎఫ్ఐ రాజకీయ శిక్షణ తరగతులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: బద్వేలు పట్టణంలో మే 6,7 తేదీల్లో నిర్వహించే డీవైఎఫ్ఐ రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో డీవైఎఫ్ఐ రాజకీయ శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నిరుద్యోగుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు చిన్ని, షాకీర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

చెన్నూరు : చెన్నూరు పోలీసుస్టేషన్ పరిధిలో నేరాలకు సంబంధించి జప్తు చేసిన వాహనాలను వేలం వేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు వాహనాల వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు చెన్నూరు పోలీసు స్టేషన్‌లో సంప్రదించి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

యువకుడి ఆత్మహత్య

కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సాయిపేటలో నివాసం ఉంటున్న గిద్దలూరు వినోద్ (26) ఆత్మహత్య చేసుకున్నాడు. మజ్జిగ దుకాణంలో పనిచేసేవాడు. చెడు వ్యసనాలకు బానిసగా మారి, అప్పులు ఎక్కువై మానసిక ఆవేదన చెందాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు మృతుని తండ్రి వీరభాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కడప అర్బన్ సీఐ సయ్యద్ హాసం తెలియజేశారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి



కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో అర్జీలు సమర్పిస్తున్న ప్రజలు

కడప కార్పొరేషన్: 'స్పందన' కార్యక్రమానికి వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో మొత్తం 42 అర్జీలు రాగా, అందులో ఇంజినీరింగ్ విభాగం –13, టౌన్‌ప్లానింగ్–7, రెవెన్యూ విభాగం–8, పబ్లిక్ హెల్త్–4, యూపీఏ విభాగం–4, హౌసింగ్–1, కడప తహసీల్దార్–1, సీకే దిన్నె తహసీల్దార్–2, ఏపీఎస్‌పీడీసీఎల్–2 వచ్చాయి. వీటిని సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రత్నాల రాజు, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, సీపీ సంజీవ్ కుమార్, ఈఈ నారాయణస్వామి, ఏసీపీ నాగేంద్ర, సూపరింటెండెంట్ జి. శివకుమార్, టీపీఎస్ చంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులకు కమిషనర్ అభినందన

రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటిన మున్సిపల్ హైస్కూల్(మెయిన్) విద్యార్థులను కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అభినందించారు. సోమవారం సాయంత్రం తనను కలిసిన విద్యార్థులను ఆయన వెన్నుతట్టి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మున్సిపల్ స్కూల్ క్రీడాకారులు ద్వితీయ స్థానం సంపాదిండం, నలుగురు విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అందులో భువన, శ్రీవల్లీ, నందిని, శ్రేయ విద్యార్థులు వచ్చేనెల ఢిల్లీలో జరుగబోవు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. చదువు, క్రీడల్లో మంచి ప్రతిభ సాధించాలని, రాష్ట్ర స్థాయి పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరచాలని విద్యార్థులకు సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎల్. వెంకటలక్ష్మిలను కమిషనర్ అభినందించారు.

రానున్న రోజుల్లో లక్షల ఉద్యోగాలు

- అందరికీ ఉద్యోగాలు కల్పించడమే నా ధ్యేయం
- కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కడపలోని కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్ రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా మారనుందని, రానున్న రోజుల్లో లక్షల ఉద్యోగాలు యువతకు లభిస్తాయని కమలాపురం శాసన సభ్యులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక స్విస్ట్ కళాశాలలో ఏఐఎల్ డిక్సన్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలో డిక్సన్ కంపెనీ ఆధ్వర్యంలో ఉద్యోగావకాశాలు కల్పించడానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని, ఇందులో సుమారు 1500 మందికి ఉద్యోగాలు ఇవ్వనున్నారన్నారు. మరో రెండు నెలల్లో ఎలిస్టా కంపెనీ రానుందని, అందులో కూడా ఉద్యోగావకాశాలు లభిస్తాయని, జమ్మలమడుగులోని జేఎస్‌డబ్ల్యూ సిమెంటు కంపెనీలో కూడా ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ఇది అంతం కాదు ఆరంభం మాత్రమే అన్నారు. చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగం కల్పించడమే తన లక్ష్యమని తెలిపారు. చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ కంపెనీ ఉద్యోగాల్లో 75 శాతం స్థానికులకే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొప్పర్తిని రాష్ట్రంలోనే అది పెద్ద ఇండస్ట్రియల్ హబ్‌గా మారుస్తున్నారన్నారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు పాకా సురేష్ కుమార్, స్విస్ట్ కాలేజ్ ఎండీ సన్నీ, కాలేజ్ సిబ్బంది, వేలాదిమంది యువత పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగర శివార్లలోని ఊటుకూరు గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్న కేశవ స్వామి కల్యాణం ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన గోసుల శ్రీనివాసులు రెడ్డి, సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి కళ్యాణం వేద పండితులు సుబ్బనరసయ్య శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణానికి గ్రామంలోని ప్రజలే కాకుండా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి ఉత్సవాల విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.

శ్రీ అప్పన్న ఆలయంలో సౌకర్యాలు కల్పించాలి

కడప రూరల్: ప్రముఖ పుణ్య క్షేత్రం శ్రీ సింహాద్రి అప్పన్న ఆలయంలో సౌకర్యాలు కల్పించాలని బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ జిల్లా కో–ఆర్డినేటర్ జనార్ధన్ తెలిపారు. సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ దేవాలయంలో భక్తులకు సౌక్యాలు కల్పించాలన్నారు. అలాగే రెగ్యులర్ కార్యనిర్వాహణాధికారిని నియమించాలని తెలిపారు.

పెద్ద దర్గాలో 'మెన్ టు' చిత్ర యూనిట్ ప్రార్థనలు

కడప కల్చరల్ : తాము రూపొందిస్తున్న, నటిస్తున్న 'మెన్ టు' చిత్రం విజయవంతం కావాలని దర్గా గురువులను కోరుకున్నామని ఆ చిత్రం దర్శకుడు శ్రీకాంత్‌రెడ్డి, యూనిట్ సభ్యులు తెలిపారు. సోమవారం ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రమైన కడప అమీన్‌పీర్ (పెద్దదర్గా) దర్గాను వారు దర్శించుకున్నారు. దర్గా ముజావర్ అమీర్ వారికి దర్గా ప్రధాన గురువుల దర్శనం చేయించారు. దర్గా చరిత్ర, విశిష్టతలను గురించి వివరించారు. అనంతరం దర్శకుడు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తమ చిత్రం మెన్ టు విజయవంతం కావాలని దర్గా గురువులను ప్రార్థించామన్నారు. సినిమా చిత్రీకరణలో స్థానికంగా సహకరించిన వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. చిత్రం హీరో నగేష్ అగస్త్య, కౌశిక్ ఘంటశాల, కార్తీక్, మౌర్య సిద్దవరం, రాకెన్ మౌళి, ఎలీషా ప్రవీణ్ పాల్గొన్నారు.

జలకాలాటలలో..





కడప కల్చరల్ : జలకాలాడడంలో ఎంతో హాయి. మనుషులకే కాదు .. మాకు హాయే అంటున్నాయి ఈ కపోతాలు. మండుతున్న ఎండల నుంచి సేద తీరేందుకు.. మైమరిచి నీటిలో మునిగి తేలుతున్నాయి. తడిసిన రెక్కలను అల్లార్చుకున్నాయి. మండుతున్న నేలపై కదలకుండా కొద్దిసేపు పడుకుండిపోయి వాతావరణాన్ని ఆస్వాదించాయి. నీటితొట్టిలో మునకలు వేసేందుకు పోటీలు పడ్డాయి. జలకాలాటలతో మండే ఎండలను మరిచి ఆనందం ఆస్వాదించాయి. కడప పెద్దదర్గా ఆవరణలో సోమవారం మధ్యాహ్నం కనిపించిన ఈ దృశ్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

29న బహిరంగ సభ

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 29న నగరంలోని ఐటీఐ సర్కిల్ వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సీపీఎం, సీపీఐ నగర కార్యదర్శులు రామ్మోహన్, వెంకట శివ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ప్రచార భేరి, ప్రదర్శన, సభకు సంబంధించిన కరపత్రాలను వామపక్ష నాయకులు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి. ఓబులేసు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉమా మహేశ్వరరావు తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు.

ఉర్దూ ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా త్వరలో నిర్వహించనున్న మెగా డీఎస్సీలో ఉర్దూ మీడియం ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయ ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని ఏపీ రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లయన్ ఇమాంబాషా, సయ్యద్ ఇక్బాల్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఐదేళ్లుగా సరిపడా ఉపాధ్యాయులు లేక ఉర్దూ మీడియం విద్యార్థులు ఎంతో నష్టపోయారని పేర్కొన్నారు. రాబోయే డీఎస్సీలో మెరిట్ ఆధారంగా ఖాళీలన్నింటిని భర్తీ చేయాలని కోరారు.

బీఎస్పీ బహిరంగసభను జయప్రదం చేయాలి

కడప రూరల్ : మే 7వ తేదిన హైదరాబాదులో నిర్వహించే బహుజన సమాజ్ పార్టీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి సగిలి గుర్రప్ప, దానం తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశంలో వారు మాట్లాడారు. బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పార్టీ శాఖల ఆధ్వర్యంలో భారీ బహిరంగసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు పార్టీ జాతీయ అధ్యక్షురాలు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి హాజరవుతారన్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు జయరాం, నాయకులు మొగిలి కాల్వ నాగరాజు, గౌస్‌పీర్, వెంకట నారాయణ, ఆనంద్, బాబు, సోమశేఖర్, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కండి

కమలాపురం: ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబుల్ పిలుపునిచ్చారు. సోమవారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగేళ్లుగా ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు.సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మాబుతారా, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు

వైవీయూ : భారతీయ సంస్కృతికి సంప్రదాయాలకు మూలం పంచాయతీరాజ్ వ్యవస్థ అని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. సోమవారం పంచాయతీరాజ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి. హరిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్‌లోని వార్డు సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన రావడం పంచాయతీరాజ్ వ్యవస్థలో కీలకపరిణామమన్నారు. అధ్యాపకులు చక్రవరి, అంకాల్‌నాగరాజు, ఎన్‌సీసీ అధికారి నీలయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : మండల పరిధిలోని నల్లింగాయపల్లె సచివాలయ పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చలపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఒకటవ సచివాలయ కన్వీనర్ విశ్వనాథ్‌రెడ్డిని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి పరామర్శించారు. విశ్వనాథ్ రెడ్డి ఇటీవల కడుపునొప్పి కారణంగా కర్నూలులో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలిసిన ఎమ్మెల్యే సోమవారం ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు.

ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం



ప్రజల సమస్యలను తెలుసుకొంటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఇందుకూరు సచివాలయ పరిధిలోని కొత్తపల్లె, అయ్యవారిపల్లె, గడ్డంవారిపల్లె, ఇందుకూరు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి గత నాలుగు సంవత్సరాల పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాల ద్వారా ఏ మేరకు లబ్ధి చేకూరిందో వారికి వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి, రాష్ట్ర మైనింగ్, పౌర సరఫరాల డైరెక్టర్లు వీరప్రతాప్‌రెడ్డి, రోజా రాణి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసిలు, సర్పంచులు, స్థానిక నాయకులు, గోపాల్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, నందకుమార్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే సుస్థిర పాలన సాధ్యం

వేముల : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుస్థిర పాలన సాధ్యమని కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి పేర్కొన్నారు. వేముల మండలం రాచకుంటపల్లె గ్రామంలో సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ – జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు.

మెగా పీపుల్స్ సర్వే ఓ చరిత్ర

కమలాపురం: జగనన్నే మా భవిష్యత్తు... మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా చేపట్టిన మెగా పీపుల్స్ సర్వే ఓ చరిత్ర అని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజనేయులు రెడ్డితో కలసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 14 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మెగా పీపుల్స్ సర్వే ఓ చరిత్ర సృష్టించిందన్నారు. 7 లక్షల మంది పార్టీ సైనికులు కోటి కుటుంబాలను సందర్శించి చేసిన సర్వేలో 78 లక్షల 68వేల మిస్డ్ కాల్స్ వచ్చాయన్నారు. నియోజకవర్గంలో 72,150 కుటుంబాలకుగాను 52,351 కుటుంబాలను సందర్శించి సర్వే చేశారన్నారు. ఇంత ఆదరణ ఉన్న ఏ పార్టీ రాష్ట్రంలోనే కాదు... దేశంలోనే లేదన్నారు. మరో ఐదు రోజులు గడువుందని, మిగిలిన కుటుంబాలన్నింటిని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలసి మద్దతు కోరుతామన్నారు. జగనన్న అందిస్తున్న పథకాలతోనే ప్రభుత్వానికి ఇంత ఆదరణ లభించిందన్నారు. సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడారు.

విద్యార్థుల సమక్షంలోనే తనిఖీ నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ స్టెల్లా షర్మిలరాణి

చెన్నూరు : పాఠశాలల్లో విద్యార్థుల సమక్షంలోనే ఉపాధ్యాయులు తనిఖీ నిర్వహించాల్సి ఉంటుందని మండల విద్యాశాఖాధికారి స్టెల్లా షర్మిలరాణి తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పాఠశాల సామాజిక తనిఖీలకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆర్‌పీ సురేష్, కోర్సు కో ఆర్డినేటర్‌గా మండల విద్యాశాఖాధికా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆమె యాప్ అప్‌లోడ్ రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అసిస్టెంట్ దశరథరామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైల్వేని ప్రైవేటీకరణ చేయడం తగదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజలకు విశేష సేవలు అందిస్తున్న రైల్వేను ప్రైవేటీకరణ చేయడం ఏమాత్రం తగదని గుంతకల్లు డివిజన్ మజ్దూర్ యూనియన్ మాజీ కార్యదర్శి సుబ్బనరసయ్య తెలిపారు. ఆల్ ఇండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్‌ని స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా కడప రైల్వేస్టేషన్‌లోని యూనియన్ కార్యాలయంలో కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బనరసయ్య మాట్లాడుతూ రైల్వే ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు ఎప్పుడు పిలుపునిచ్చినా కార్మిక లోకం కదిలి రావాలన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ కడప బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రావు యూనియన్ కార్మికుల హక్కుల సాధన కోసం చేసిన పోరాటాలు, సాధించిన విజయాలు, కార్మికుల సంక్షేమానికి చేసిన కృషిని వివరించారు. యూనియన్ నాయకులు జయరాముడు, అతావుల్లా, వెంకట సుబ్బయ్య, రామకృష్ణ, శంకర్‌బాబు పాల్గొన్నారు.

మాసాపేటలో స్థానికుల ఆందోళన

కడప కల్చరల్ : కడప నగరం మాసాపేటలోని పారిశుధ్య కార్మికుల కాలనీలో సోమవారం రాత్రి స్థానికులు ఆందోళన నిర్వహించారు. ఇటీవల ఆ ప్రాంతంలో రోడ్డు విస్తరించడంలో భాగంగా అక్కడి ఆలయం మీదుగా రోడ్డు నిర్మాణానికి మార్కింగ్ చేశారు. ఇరువైపుల రోడ్డు వేసినా ఇంతవరకు ఆలయం జోలికి వెళ్లలేదు. సోమవారం సాయంత్రం ఆలయం మీదుగా కాలువ తవ్వకం పనులు ప్రారంభించడంతో స్థానికులు అభ్యంతరం తెలిపారు. ఇంతలో బీజేపీ స్థానిక నాయకులు లక్ష్మినారాయణ, బాలకృష్ణ యాదవ్‌లతోపాటు హిందూ చైతన్యవేదిక ప్రతినిధి నీలకంఠారెడ్డి తదితరులు అక్కడికి చేరుకుని స్థానికులకు మద్దతుగా నిలిచారు. మున్సిపల్ కమిషనర్ వచ్చి సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని కోరుతూ స్థానికులతో కలిసి మానహారం ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను దిగ్బంధించారు. ఆందోళన కారులు అక్కడికి చేరుకున్న పోలీసులతో వాగ్వివాదానికి దిగారు.

పల్లె పురస్కారం.. ప్రగతికి ప్రోత్సాహం

వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన పలు పంచాయతీలను ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక చేసింది. ఈ మేరకు సోమవారం పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా అవార్డులు ప్రదానం చేసి అభివృద్ధిలో మరింత ఉత్సాహంగా ముందుకు వెళ్లేలా ప్రోత్సాహం అందించింది.

చెన్నూరు : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని బయనపల్లె గ్రామ పంచాయతీ ఉత్తమ పంచాయతీగా ఎంపికై జిల్లా స్థాయి ప్రథమ బహుమతి తీసుకున్నట్లు ఎంపీడీఓ గంగనపల్లె సురేష్‌బాబు, సర్పంచ్ తుంగ చంద్రశేఖర్ యాదవ్ తెలిపారు. సోమవారం వారు చెన్నూరులో విలేకరులతో మాట్లాడారు. సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి పేదరికం లేని అలాగే మెరుగైన జీవనోపాధుల గ్రామ పంచాయతీ విభాగంలో ఈ అవార్డు లభించిందన్నారు. ఈ అవార్డు రావడానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారుల కృషి ఎంతో ఉందన్నారు. బయనపల్లె పంచాయతీకి అవార్డు రావడం పట్ల ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, జెడ్పీటీసీ ముదిరెడ్డి దిలీప్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

కమలాపురం: ప్రజారంజక పాలన అందించినప్పుడే సేవకులను జీవితాంతం ప్రజలు గుర్తు చేసుకుంటారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం ఎంపీడీఓ సభా భవనంలో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 9 అంశాల్లో వివిధ స్థాయిలో అవార్డులు పొందిన పంచాయతీ ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఎమ్మెల్యే ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు ఎన్‌టీఆర్, వైఎస్సార్, నేడు సీఎం జగన్‌మోహన్ రెడ్డిలను ప్రజలు జీవితాంతం గుర్తు చేసుకుంటారన్నారు.

గంగిరెడ్డిపల్లెకు ఉత్తమ పంచాయతీ అవార్డు

వీరపునాయునిపల్లె : మండలంలోని గంగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ త్తమ పంచాయతీగా రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికై ంది. పంచాయతీలోని సమస్యలను గుర్తించడంలో సర్పంచ్ కల్లూరు శిరీష ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. జగనన్న కాలనీ నిర్మాణం సత్వర పూర్తికి స్థానిక ఎంపీటీసి రఘునాథరెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి సారించారు. గంగిరెడ్డిపల్లె గ్రామానికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామస్తుల సహకారం మరువలేనిది



గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు గ్రామస్తులు అందించిన సహకారం మరువలేనిది. ఉత్తమ పంచాయతీ అవార్డుకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. పదవీ కాలం ముగిసే లోపు గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఆదర్శ పంచాయతీగా తీర్చి దిద్దేందుకు కృషిచేస్తాను.

–కల్లూరు శిరీష
(పంచాయతీ సర్పంచ్, గంగిరెడ్డిపల్లె)

అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది




రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది. సర్పంచ్ శిరీష, గ్రామస్తులు, నాయకులు, సిబ్బంది అందించిన సహకారంతోనే ఈ అవార్డు సాధించగలిగాం. వారి సహకారం మరువలేనిది.

–మస్తాని
(పంచాయతీ కార్యదర్శి, గంగిరెడ్డిపల్లె)

మోదీ విధానాలు లౌకిక వాదానికి ప్రమాదం

ప్రొద్దుటూరు : ప్రధాని మోదీ విధానాల వల్ల దేశంలో లౌకిక వాదానికి పెనుప్రమాదం దాపురించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర విమర్శించారు. స్థానిక సీపీఐ, సీపీఎం పట్టణ కార్యదర్శులు సుబ్బరాయుడు, సత్యనారాయణ ఆధ్వర్యంలో మోదీని గద్దె దింపండి – దేశాన్ని కాపాడండి ప్రచార భేరిలో భాగంగా సోమవారం స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గాలి చంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు ఒక్కొక్కటి కారుచౌకగా తెగనమ్మి భావితరాలకు తీరని ద్రోహం చేస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా రద్దు చేసేందుకు కుట్ర పన్ని నిధులను విడుదల చేయడం లేదన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, సమతి సభ్యులు శివారెడ్డి, యేసోబ్, చంద్రశేఖర్, శ్రీను, నరసింహా, ప్రమీల, సీపీఎం నాయకులు ఫక్కీరయ్య, సుబ్బమ్మ, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఇన్‌స్పెక్టర్ అదృశ్యంపై కేసు నమోదు



శివప్రసాద్ (ఫైల్)

కడప అర్బన్: కడప మునిసిపల్ కార్పొరేషన్‌లో హెల్త్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సవరాల శివప్రసాద్ (40) 2018 నుంచి కనిపించలేదు. ఈయనకు భార్య సవరాల వాణి, ఇద్దరు పిల్లలు సంతానం. ఒక కాలు పోలియో రావడంతో చిన్నప్పటి నుంచి దివ్యాంగునిగానే వున్నారు. మతిస్థిమితంలేక అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళ్లిపోయేవాడు. చివరగా 2018 నుంచి రాలేదనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఒన్‌టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలియజేశారు.